క్లుప్తంగా

శుభకార్యం

బ్రహ్మసముద్రం: కర్ణాటకలోని చిత్రదుర్గంలో బ్రహ్మసముద్రం జెడ్పీటీసీ సభ్యురాలు ప్రభావతి కుమార్తె పూజ– త్యాగరాజన్ వివాహం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మంత్రి ఉషశ్రీచరణ్ దంపతులు, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, భారతి దంపతులు, అనంతపురం ఎంపీ తలారి రంగయ్య , జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

కళాకారులను ప్రోత్సహించాలి



సమావేశమైన కళాకారుల సంఘం నాయకులు

ఉరవకొండ: అంతరించిపోతున్న కళలు, కళాకారులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలని ఉరవకొండ సరస్వతీ నాట్యమండలి సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పెన్నహోబిళంలో కళాకారుల సమావేశం నిర్వహించారు. యూనియన్ నాయకులు రామసుబ్బారెడ్డి, నరసింహులు మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకోరావడానికి కళలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఆటపాటల ద్వారా ప్రజల్లో ఉత్సాహం నింపేందుకు నాటకాలు అవసరమన్నారు. కార్యక్రమంలో 200 మంది కళాకారులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

వజ్రకరూరు: మండలంలోని ఛాయాపురంలో సోమవారం ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామ సచివాలయ కన్వీనర్ రమేష్ ఆదివారం తెలిపారు అధికారులు, ప్రజాప్రతినిదులు, వైఎస్సార్‌సీపీ హాజరు కావాలన్నారు.

విజేతలకు బహుమతులు



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: పట్టణంలోని సీఅండ్‌ఐజీ మిషన్ చర్చిలో ఆదివారం ట్రాన్స్ వరల్డ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో బైబిల్ పోటీ పరీక్షలు నిర్వహించారు. బైబిల్ టెస్ట్ కో ఆర్డినేటర్ రవికుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విజేతలైన శాంత భాస్కర్, నయోమి, ఎస్తేర్ రాణికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్లు నారాయణపాల్, ఐజయ్య, రాజేష్, చల్లా కిశోర్, రాజశేఖర్, జోసెఫ్ కిశోర్, సునీల్, ఆర్థర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి



ట్రోఫీ ప్రదానం చేస్తున్న నాయకులు

బొమ్మనహాళ్: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సర్పంచ్ వన్నల్లి రామాంజనేయులు సూచించారు. మండలంలోని దర్గాహొన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. చివరి రోజు హోరాహోరీగా పోరులో దర్గాహొన్నూరు జట్టుపై చాబాల జట్టు విజయం సాధించింది. విన్నర్ జట్టుకు రూ.20 వేలు, ట్రోఫీను ఎంపీటీసీలు మనోహర్‌శెట్టి, రామకృష్ణతో కలసి సర్పంచ్ అందజేశారు. రన్నర్స్ జట్టుకు రూ. 10 వేలను బడిగే వన్నూరుస్వామి అందజేశారు.

స్వీపర్ ఆత్మహత్య



అనిల్‌కుమార్ మృతదేహం

ఉరవకొండ: స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో కాంట్రాక్టు స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్న అనిల్‌కుమార్(30) ఆదివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలోని మారెమ్మ ఆలయం వద్ద నివాసముంటున్న ఆయనకు భార్య మహేశ్వరి, ముగ్గురు కుమార్తెలున్నారు. ఆర్థిక ఇబ్బందులతోపాటు, అప్పులిచ్చిన వారి ఒత్తిళ్లు అధికం కావడంతో ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఇంటి బయట ఉన్న అనిల్ తల్లి రామలక్ష్మి గమనించి గట్టిగా కేకలు వేస్తూ కాలనీవాసులను పిలవడంతో అతన్ని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఖరీఫ్ 'సాగు' ఖరారు

- మూడు లక్షల హెక్టార్లలో పంటల సాగు
- వ్యవసాయ పనుల్లో రైతుల బిజీ



నేలను దుక్కి చేస్తున్న రైతు

రాయదుర్గం: ఖరీఫ్ సాగు ప్రణాళికలను అధికారులు ఖరారు చేశారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో గ్రామాల వారీగా సాగు వివరాలు సేకరించారు. గత నాలుగేళ్ల నుంచి ఖరీఫ్‌లో వర్షాలు ఊరిస్తుండడంతో సాధారణం కంటే పంటల సాగు విస్తీర్ణం ఘణనీయంగా పెరగనుంది. మూడు నియోజకవర్గాల్లో అన్ని పంటలకు కలిపి సాధారణ విస్తీర్ణం 3,02,420 హెక్టార్లు కాగా, గతేడాది 3,05,420 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది కూడా మెజార్టీ సాగు వేరుశనగతో పాటు కంది, ఆముదం, పత్తి, ఉలువ, సజ్జ, కొర్ర లాంటి పంటల వైపే రైతులు మొగ్గుచూపుతున్నాట్లు అధికారులు చెపుతున్నారు. ఈ నేపథ్యంలో పంటలకు సరిపడ ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను ఆర్‌బీకేల ద్వారా రైతు చెంతకే చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది.

పొలం పనుల్లో బిజీబిజీ..

వ్యవసాయ పనుల్లో రైతన్నలు బిజీగా ఉన్నారు. పొలాల్లో ముళ్లపొదలు తొలగించడం, ట్రాక్టర్, ఎద్దుల ద్వారా దుక్కులు దున్నడం, గట్లు మరమ్మతు చేసుకోవడం తదితర పనులు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగానే విత్తన వేరుశనగ సమకూర్చడంతో కార్తెల ఆరంభంలోనే సాగు చేపట్టేలా కసరత్తు చేస్తున్నారు. అలాగే నేల సాంద్రత పెంచి అధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశ్యంతో రైతులు సేంద్రియ ఎరువులు దుక్కిలో కలిపేలా చర్యలు చేపట్టారు.

ఖరీఫ్‌కు సర్వం సిద్ధం..

రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను సర్వం సిద్ధం చేశామని రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ఏడీఏలు లక్ష్మానాయక్, యల్లప్ప, పద్మజ తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం ద్వారా సబిసడీ విత్తన వేరుశనగ అందజేశామన్నారు. మూడూ నియోజకవర్గాల్లోనూ గతేడాది 3,05,420 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగులోకి వచ్చాయన్నారు. ఈ ఏడాది సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

ఆముదం సాగుపై ఆసక్తి

కూడేరు: మండలంలో ఆముదం పంట సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఏటా ఆముదం పంట సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఆముదం పంట సాగుకు పెట్టుబడి తక్కువ. వర్షాలు తక్కువగా కురిసిన పంట తట్టుకొని దిగుబడిని ఇస్తుందని రైతులు సాగుకు మొగ్గ చూపుతున్నారు. 2020–21లో 2,205 ఎకరాలు, 2021–22లో 1792 ఎకరాలు, 2022–23లో 7,972 ఎకరాల్లో ఆముదం సాగు చేసినట్లు మండల గణాంకాధికారిణి ఆశా తెలిపారు. ఈ ఖరీఫ్‌లో వర్షాధారం కింద ఎక్కువ విస్తీర్ణంలో ఆముదం పంట సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమం జగన్‌తోనే సాధ్యం



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

గుమ్మఘట్ట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చి అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టిస్తున్నారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని అడిగుప్ప గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. విప్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయన్నారు. జగన్ పరిపాలను చూసిన కేంద్ర ప్రభుత్వం మెచ్చుకుంటుంటే చంద్రబాబు అండ్ కో మాత్రం కడుపుమంటతో రగిలిపోతున్నారన్నారు. అధికారంలోకి రాకమునుపు ఒకలా , అధికారం వచ్చాక మరోలా మారే చంద్రబాబును ఎట్టి పరిస్థితుల్లో నమ్మరాదని హితవు పలికారు. వలస వచ్చిన కాలువ శ్రీనివాసులు నియోజకవర్గానికి వచ్చినప్పుడు ప్రచార ఆర్భాటం కోసం ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేయడం తప్ప మరో ధ్యాస లేదని మండిపడ్డారు. ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని విప్ సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, ఎంపీపీ భవాని, ఈఓఆర్డీ సురేశ్‌బాబు, పార్టీ మండల కన్వీనర్ బోయ మంజునాథ, కాంట్రాక్టర్ ఆర్టీ కాంతారెడ్డి, వైస్ ఎంపీపీ సిరిగె జయమ్మ, ఎంపీటీసీ గోవింద, గ్రామ నాయకులు రాజేష్, రామాంజనేయులు, చిన్నయ్య, పాలన్న, తిప్పేరుద్ర, ఎర్రిస్వామి, రవి, మల్లికార్జున, నాగరాజు, నాగేంద్ర, బడిగే చిన్నయ్య, సత్యన్న తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ

గుమ్మఘట్ట: మండలంలోని అడిగుప్ప గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా రూ.16 లక్షల నిధులతో భవన నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. సీఎం జగన్ విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు కొండంత అండగా నిలుస్తున్నారన్నారు. భవనాన్ని నాణ్యతగా నిర్మించి సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గ్రామంలోని ప్రైవేటు స్థలాన్ని గ్రామస్తులు చిన్నమల్లయ్య, కాటయ్య, శివన్న, బడిగే చిన్నయ్య, కాంట్రాక్టర్ చిన్నయ్య ఉదారస్వభావంతో దానం చేయడంతో దాతలను ఆయన పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, ఐసీడీఎస్ సీడీపీఓ ప్రభావతమ్మ, ఎంపీపీ భవాని, వైస్ ఎంపీపీ జయమ్మ, వైస్ సర్పంచ్ రమేష్, గ్రామస్తులు రాజేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు



కళ్యాణదుర్గం: మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి



ఉరవకొండ: విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న గ్రంథాలయ అధికారి ప్రతాప్‌రెడ్డి



కణేకల్లు: విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న గ్రంథాలయాధికారి వన్నూరుస్వామి

కళ్యాణదుర్గం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి అన్నారు. కళ్యాణదుర్గంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా చైర్‌పర్సన్‌తో పాటు కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు, సరస్వతీ విద్యా మందిరం ప్రధానోపాధ్యాయుడు కరణం తిరుమలరావు హాజర య్యారు. వారు మాట్లాడుతూ వేసవిలో మే 8 నుంచి జూన్ 11వ తేదీ వరకు సుమారు 35 రోజుల పాటు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. గ్రంథాలయాల ద్వారా చిన్నారుల మేథోశక్తి పెంపొందించడానికి అవకాశం ఉందన్నారు. విద్యార్థి దశ నుండే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. సమ్మర్ క్యాంప్‌లో కథలు చెప్పడం, పుస్తకాలు చదవడం, చిత్రలేఖనం, మ్యూజికల్ చైర్స్, స్కిప్పింగ్, లెమన్ స్పూన్ పోటీలలో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి, గ్రంథాలయాధికారి శ్రీనివాసులు, బాలచందర్, యమునా, శ్యామల, ముస్తాఫాఖాన్, ఉమామహేశ్వరి, పాఠకులు పాల్గొన్నారు.

కంబదూరు: స్థానిక గ్రంథాలయంలో నిర్వహించి సమ్మర్ క్యాంప్ ఆదివారం ముగిసిందని గ్రంథాయాధికారి సత్యం బాబు తెలిపారు. సర్పంచ్ పద్మవతమ్మ ప్రతిభ కనబరచిన పిల్లలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సచివాలయ టెక్నికల్ అసిస్టెంట్ మహేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిర కార్యక్రమం ఆదివారం ముగిసినట్లు గ్రంథాయల అధికారిణి రజిని తెలిపారు. ఈ సందర్భంగా పలు పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఉరవకొండ: పట్టణంలోని ప్రధాన గ్రంథాలయ ప్రధానశాఖలో వేసవి శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ప్రతాప్‌రెడ్డి, మండల రిసోర్స్ పర్సన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: గత నెల 8న ప్రారంభమైన సమ్మర్ క్యాంపు కార్యక్రమం ఆదివారం ద్విగ్విజయంగా ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి రాధారాణి విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేశారు. అనంతరం నిర్వహించిన ఆటపాటలు, వ్యాస రచన పోటీల్లో విజేతలుగా నిలిచిన పిల్లలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది రంగయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి మునెమ్మ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం సమ్మర్ క్యాంపులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎంఈఓ ఎ త్రిస్వామి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

కణేకల్లు: స్థానిక గ్రంథాలయంలో 35 రోజుల పాటు ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాలు (సమ్మర్ క్యాంప్) విద్యార్థులకు ఎంతో దోహదపడ్డాయని గ్రంథాలయాధికారి వన్నూరుస్వామి అన్నారు. సమ్మర్ క్యాంపు ముగింపు సందర్భంగా ఆదివారం విద్యార్థులకు ప్యాడ్లు, పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు.

నేడు మంత్రి సమీక్ష సమావేశం

బ్రహ్మసముద్రం: పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఉదయం 9.00 గంటలకు మండలంలోని బొమ్మగానిపల్లి, తీటకల్లు, రాయలదొడ్డి, ముప్పలకుంట, ఎరడికెర, గుండిగానిపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులతో మంత్రి ఉషశ్రీచరణ్ సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, డీలర్లు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తప్పక హాజరు కావాలని మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు.

నేడు 'విద్యాకానుక' కిట్ల పంపిణీ

రాయదుర్గం: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేయనున్నట్టు వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ముస్తాక్ ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి విద్యాశాఖ అధికారులు, చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కావాలన్నారు.

'ఎగువ కాలువ ఆధునుకీకరణ చేపట్టాలి'

కూడేరు: తుంగభద్ర ఎగువ కాలువను ఆధునుకీకరణ చేపట్టి హెచ్చెల్సీ కెనాల్ ద్వారా నీరు విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన నీటి సాధనకై రైతు గర్జన ప్రచార జాతా ఆదివారం మండలంలోని కొర్రకోడు, జయపురం, చోళసముద్రం, ముద్దలాపురం, కూడేరు, కడదరకుంట, అరవకూరు, కమ్మూరు గ్రామాల్లో సాగింది. వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్, తాలుకా కార్యదర్శి మల్లికార్జున , జిల్లా నేతలు రమణ, సంగప్ప, నియోజకవర్గ సహాయ కార్యదర్శి మనోహర్, మండల కార్యదర్శి నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్సీ, జనరల్ స్టోర్స్ కార్యవర్గం ఎన్నిక

రాయదుర్గంటౌన్: పట్టణ ఫ్యాన్సీ, జనరల్ స్టోర్స్ కార్యవర్గాన్ని ఆల్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో సమావేశం నిర్వహించారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా లోకేష్, భీమరాజు, గౌరవాధ్యక్షుడిగా గాజుల వెంకటేశులు, ఉపాధ్యక్షుడిగా బీహెచ్ అబ్బాస్, కోశాధికారిగా హర్ష శివరాజ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆల్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఇస్మాయిల్, ధనార్జున, కంసల నాగరాజు, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

ఉరవకొండ: స్థానిక చిన్నముష్టూరు మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా సాగింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షలు జరిగాయి. మొత్తం 95 మంది పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా 12 మంది గైర్హాజరయ్యారు. పరీక్షను చీఫ్ ప్రశస్తకుమారి, డీఓ వీరన్న పర్యవేక్షించారు.

ఉద్యోగుల జీవితాల్లో వెలుగు

రాయదుర్గం: కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, సీపీఎస్ బదులు జీపీఎస్ తేవడం, వైద్య విధాన పరిషత్ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం సాహసోపేత నిర్ణయమని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఎంత కష్టమైన సరే వెనుకడుగు వేయకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారి జీవితాల్లో వెలుగులు నింపేలా కృషి చేశారని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్వగృహం వద్ద విప్ కాపు 'సాక్షి' తో మాట్లాడారు.. ఉద్యోగ అభద్రత, శ్రమదోపిడీకి నిలువెత్తు నిదర్శనమైన కాంట్రాక్ట్ వ్యవస్థకు సీఎం జగన్ చరమగీతం పాడారన్నారు. 20 ఏళ్ల సుదీర్ఘకలను సాకారం చేసేలా కీలక నిర్ణయం తీసుకుకోవడం విశేషమన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విందంగా ఏపీలో మాత్రమే సీపీఎస్ స్థానంలో జీపీఎస్ అమల్లోకి తీసుకొచ్చారన్నారు. గత టీడీపీ హయాంలో పీఆర్సీ కోసం ఉద్యోగులు రోడ్డెక్కి ఆందోళనలు చేసినా పట్టించుకునే పరిస్థితి ఉండేది కాదన్నారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేస్తానని దొంగ హామీలిచ్చి చంద్రబాబు మాట తప్పారన్నారు.

గోశాల నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న వీహెచ్‌పీ, గోసంరక్షక దళ్ సభ్యులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని గొల్లపల్లి రోడ్డు చెక్‌పోస్టు సమీపంలో కొండపై వెలసిన మాధవరాయస్వామి మాన్యంలో గోశాల నిర్మాణానికి ఆదివారం భూమి పూజ కార్యక్రమం జరిగింది. విశ్వ హిందూ పరిషత్, గో సంరక్షక దళ్ ఆధ్వర్యంలో గోశాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ అధ్యక్షుడు రాజేష్, గో సంరక్షక దళ్ ప్రతినిధి ప్రశాంత్ మాట్లాడుతూ రోడ్లపై పదుల సంఖ్యలో పశువులు సంచరిస్తూ అనారోగ్యం పాలవుతున్నాయన్నారు. యజమానులు పట్టించుకోకపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. దీంతో గోవులను సంరక్షించే బాధ్యత వీహెచ్‌పీ, గో సంరక్షక దళ్ తీసుకుంటుందన్నారు. గోశాల నిర్మాణానికి దాతల సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో అభయాంజనేయస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు కోదండ సత్యనారాయణ, గో సంరక్షక ప్రేమికులు, ప్రజలు పాల్గొన్నారు.

అర్ధరాత్రి వాహనదారుల నుంచి వసూళ్లు!

బొమ్మనహాళ్: జల్సాలకు అలవాటు పడిన కొందరు యువకులు రాత్రిపూట వెళ్లే వాహనాలను ఆపుతూ వాహనదారులను భయభ్రాంతులకు గురిచేసి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న సంఘటన మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. రాయదుర్గం రూరల్ సీఐ యుగంధర్ తెలిపిన వివరాల మేరకు.. ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన రాజేష్, వన్నూరుస్వామి, నాని, నాగరాజు, రవిచంద్ర శనివారం అర్ధరాత్రి సమయంలో గ్రామ శివారులోని బళ్లారి –కళ్యాణదుర్గం రహదారిపై వాహనాలను ఆపి , వాహనదారులను భయభ్రాంతులకు గురి చేసి డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. మండలంలోని శ్రీరంగాపురం క్యాంపు గ్రామానికి చెందిన ఉప్పర హనుమంతు అనే వ్యక్తి వాహనాన్ని ఆపి డబ్బులు డిమాండ్ చేశారు. ఆయన నుంచి రూ.1500 వసూళ్లు చేశారు. దీంతో బాధితుడు 100 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయడంతో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఉద్దేహాళ్ గ్రామ శివారులో ఉన్న యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉప్పర హనుమంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు హాజరు పరచనున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి



విద్యుత్ స్తంభాలు పక్కపక్కనే ఉన్న దృశ్యం

వజ్రకరూరు: మండలంలోని పీసీ కొత్తకోట గ్రామంలోని కొల్లపురమ్మ దేవాలయం వద్ద తరుచూ విద్యుత్ సమస్యలు వస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు తిప్పయ్య, ఎర్రిస్వామి, కొల్లప్ప, ఓబుళేసు, పెన్నయ్య వాపోయారు. కాలనీలో రెండు విద్యుత్ స్తంభాలు ఒకే చోట ఉండడంతో తీగలు తగులుకుని నిప్పురవ్వలు ఎగసిపడడంతోపాటు తరచూ కరెంట్ సరఫరా నిలిచిపోతోందన్నారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడం, ఇళ్లలో లైట్లు, టీవీలు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరారు.

తాళాలు పగలగొట్టి.. బంగారం, నగదు చోరీ

రాయదుర్గం: పట్టణ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న జేఆర్ఎస్ కాలనీలో నివాసం ఉంటున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు మధుసూదన్‌రెడ్డి ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. పని నిమిత్తం ఆయన కుటుంబ సభ్యులతో కలసి రెండు రోజుల కిత్రం ఇంటికి తాళాలు వేసుకుని పొద్దుటూరుకు వెళ్లాడు. శనివారం అర్ధరాత్రి దాటాక తలుపులు పగలకొట్టి దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. బీరువా ధ్వంసం చేసి ఐదు బంగారు ఉంగరాలు, రూ. 65 వేల నగదును అపహరించుకెళ్లారు. పక్కింటి వారు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో హుటాహుటినా రాయదుర్గం చేరుకుని ఇంట్లో చోరీ జరిగినట్టు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న అర్బన్ సీఐ లక్ష్మన్న ఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్‌టీమ్‌ను రప్పించారు. క్లూస్ టీమ్ పరిశీలించినా ఎలాంటి ఆధారాలు లభించలేదని సీఐ తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థినులు

రాయదుర్గంటౌన్: 30 ఏళ్ల తరువాత పదో తరగతి బ్యాచ్ విద్యార్థినులు స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం కలుసుకున్నారు. 1993 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు గెట్‌టు గెదర్ కార్యక్రమం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులు రామాంజనేయులు, రామప్ప, శమంతకమణి, సరస్వతి, లలితకళ, రాగవమ్మ, నిర్మలను సత్కరించి, జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బైక్ ర్యాలీ జయప్రదం చేయండి'

రాయదుర్గంటౌన్: వడ్డెర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారంఉదయం 10 గంటలకు పట్టణంలో నిర్వహించే బైక్ ర్యాలీ విజయవంత చేయాలని ఆసంఘం తాలూకా అధ్యక్షుడు వడ్డే గోవిందు, పట్టణశాఖ అధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. పట్టణశాఖ వడ్డెర్ల సంఘం నూతన కమిటీతోపాటు సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తామన్నారు. వడ్డెర్లు హాజరై జయప్రదం చేయాలన్నారు.

పరామర్శ

శెట్టూరు: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు హరిజన లింగప్పను ఎంపీ తలారి రంగయ్య ఆదివారం పరామర్శించారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎంపీ ఆయనను పరామర్శించి, ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బోయ తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నాయకుడు అయ్యూర్‌దాదు తల్లి అయ్యూర్‌రహ్మత్‌బీ శనివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న యువజన విభాగం రాయలసీమ జిల్లాల చైర్మన్ ప్రణయ్‌రెడ్డి ఆదివారం రహ్మత్‌బీ మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ చందా చంద్రమ్మ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, మూలగిరిపల్లి ఓబన్న, మైనార్టీ నాయకులు పామిడిసలీం, అన్వర్, శర్మాస్,మోమిన్ జిలాన్ తదితరులు పాల్గొన్నారు.